26042025-MAI-17_Layout 1 4/26/2025 3:44 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# తెలంగాణ ఆకాంక్షల సభ



**వద్దిరాజు రవిచంద్ర**

**25 ఏండ్ల బీఆర్ఎస్ రజతోత్సవ ఉత్సవాలన్నవి ఒక రాజకీయ పార్టీ తనకు తాను జరుపుకొనే సంబురాలు మాత్రమే కావు. అందులో తెలంగాణ ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పేగుబంధాలతో కలగలసిన ఈ నేల అస్తిత్వం ఉంది. తెలంగాణ ఆత్మగౌరవ ఉద్యమ జెండాను విశ్వవీధుల్లో ఎగురవేసిన ఖ్యాతి బీఆర్ఎస్‌కు మాత్రమే ఉంది. తెలంగాణ అస్తిత్వాన్ని స్వరాష్ట్ర ఉద్యమంగా కొనసాగించటమే గాక రాష్ర్టాన్ని సాధించటం, సాధించిన రాష్ర్టాన్ని తీర్చిదిద్దటంలో కూడా బీఆర్ఎస్ పాత్ర ముఖ్యమైనది.**




స్వరాష్ట్ర ఉద్యమాన్ని కదం తొక్కించి స్వరాష్ట్ర సాధనను విజయతీరాలకు చేర్చి, స్వరాష్ట్రంలో స్వయంగా తానే పాలనా పగ్గాలు చేపట్టి తెలంగాణ పునర్నిర్మాణాన్ని చేపట్టిన ఖ్యాతి దార్శనిక నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావుకే దక్కుతుంది. తెలంగాణ స్వరాష్ట్ర సాధకుడిగా, జయుడిగా, అజేయుడిగా, ఒకే ఒక్కడిగా, తెలంగాణ ఆత్మబంధువుగా చరిత్రలో చెదిరిపోని స్థానం కేసీఆర్‌దే. బీఆర్ఎస్ వ్యవస్థాపకునిగా దార్శనిక ఆలోచనలతో జాతీయ రాజకీయాల్ని ప్రభావితం చేసిన చరిత్ర కేసీఆర్‌ది. అందుకే ఆయనను 'దటీజ్ కేసీఆర్' అని గత కాలమే ఇష్టంగా రికార్డు చేసింది.

మతాలు, కులాలు, వర్గాల పేరుతో ప్రజలు చీలిపోవచ్చు, కొందరు కుల అస్తిత్వం కోసమే రాజకీయాలు చేస్తూ జెండాలు పట్టవచ్చు. తమ కులం అధికారంలోకి రావాలని ఆధిపత్య, అగ్రకులాలు పోటీ పడటం గత 80 ఏండ్లుగా దేశ రాజకీయాల్లో చూస్తూనే ఉన్నాం. అందుకు అవిభక్త ఆంధ్రప్రదేశ్, ఇప్పటి రెండు తెలుగు రాష్ర్టాలు అతీతమేమీ కాదు. తెలంగాణ రాష్ర్టానికి మాత్రం అస్తిత్వ, ఆత్మగౌరవాన్ని తెచ్చిపెట్టింది మాత్రం బీఆర్ఎస్సే. రాష్ర్టాన్ని ఇచ్చింది తామేనని కాంగ్రెస్ క్లయిమ్ చేసుకోవటానికి విఫలయత్నం చేసింది. కానీ, తెలంగాణ ప్రజలు దాన్ని ఒప్పుకోలేదు. పైగా 1969 ఉద్యమాన్ని నెత్తురుటేర్లల్లో ముంచింది.. మలిదశ ఉద్యమకాలంలో ఎన్నెన్నో కష్టనష్టాలు పడటానికి, వందలాది మంది యువత ఆత్మబలిదానాలు చేసుకోవటానికి మొదటి ముద్దాయిగా బోనెక్కవలసింది కాంగ్రెస్ పార్టీనే. ఆనాటి సీమాంధ్ర పాలకులు, పార్టీలుగా కాంగ్రెస్, టీడీపీ.. తెలంగాణ అస్తిత్వ ఉద్యమంపై చేయని దాడిలేదు, పెట్టని హింసలేదు. అణచివేతలతో నిత్య నిర్బంధాలను ప్రయోగించారు.

> తెలంగాణను తీరొక్క హింసలకు గురిచేసినవాళ్లు గత చరిత్రను మరిచి ఇప్పుడు గొంతు మార్చి మాట్లాడితే చరిత్ర క్షమించదు. తెలంగాణ అస్తిత్వ ఉద్యమ జెండా పట్టి నిలిచిన చరిత్ర బీఆర్ఎస్‌దే. తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమ గొంతుకతో సీమాంధ్ర పార్టీల మెడలు వంచి ఉద్యమ స్వరాన్ని వినిపించింది బీఆర్ఎస్సే. తెలంగాణ సమాజం ఎదుర్కొన్న సకల అనర్థాలకు ఏ వర్గం, ఏయే పార్టీలు కారకులో విప్పి చెప్పింది బీఆర్ఎస్సే.

తెలంగాణను ఎన్‌కౌంటర్ల నెత్తుటి ముద్దచేసింది ఎవరు? 'ఇందిరమ్మ సోషలిజం ఎందు కొచ్చిందిరో ఇంద్రవెల్లిలోన వందమందిని మింగిందిరో' అని కవులు కట్టిన పాటలు ఎవరిమీద వచ్చాయి? 'నాగలిపట్టిన రైతు చేతికో రైఫిలిచ్చిందిరో నాయనా' అని పాటలు పుట్టడానికి కారణమెవరు? ఏయే పార్టీలనేది ఈ సందర్భంగా చూడాలి. తెలంగాణలో చీకటి పడితే బయటకు రాలేని స్థితికి కారకులెవరు? తెలంగాణకు ఉద్యమ సమయంలోనే ఊపిరాడే స్థితిని తీసుకువచ్చింది మలిదశ తెలంగాణ అస్తిత్వ ఉద్యమం. ఈ అస్తిత్వ ఉద్యమ జెండా చేతబట్టి గర్జించిన మహాశక్తి కేసీఆర్.

రాష్ట్రం వచ్చాక కొన్ని వర్గాలకు అధికారం చేజారిపోవచ్చు. తెలంగాణలో పాతుకుబోయిన పెత్తందారీ వ్యవస్థ పునాదులు కదిలి ఉండవచ్చు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో వేగవంతంగా పునర్నిర్మాణం జరిగింది. నెర్రెలు బారిన నేలకు నీళ్లందింది. చెరువులు మత్తళ్లు దుంకాయి. కాళేశ్వర జల గంగ వందల కిలోమీటర్లు ప్రవహించి బీడు నేలలను సస్యశ్యామలం చేసింది. తెలంగాణ దేశానికి ధాన్యాగారం అయ్యింది. దళితబంధు, బీసీబంధులు వచ్చాయి. 33 జిల్లాలతో పాలన ప్రజల ముంగిళ్ల దాకాపోయింది. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఇంటింటికి నల్లా నీళ్లు, 1100 గురుకులాల ద్వారా లక్షలాదిమంది బడుగుల బిడ్డల చదువులు, ఒకటారెండా వందల పథకాలు కేసీఆర్ ఆలోచనల నుంచి జనించి, ఆచరణ రూపుదాల్చాయి. 29వ రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ అన్ని రంగాల్లో శిరసెత్తుకుని నిలిచింది. ఇది చరిత్ర. దీన్నెవ్వరూ చెరిపేయలేరు.

2023 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచింది. బీఆర్ఎస్ ఓడింది. ఎన్నికల్లో గెలుపోటములు సహజం. ప్రజలు గెలుపోటముల నుంచి తిరిగి పాఠాలు తీసుకుంటారు. గడిచిన 25 ఏండ్ల కాలంలో ఒక రాజకీయ పార్టీగా బీఆర్ఎస్ వేసిన అడుగులు, నడిచిన నడత, తెలంగాణను ముందుకు నడిపించిన తీరునంతా సింహావలోకనం చేసుకోవటం కోసమే బీఆర్ఎస్ రజతోత్సవాలను జరుపుకొంటుంది. తెలంగాణ నేలలో నిర్మితమైన గంగాజమునా తెహజీబ్ సంస్కృతిని భద్రంగా కాపాడి రాబోయే తరాలకు అందించటంలో బీఆర్ఎస్ పాత్ర కీలకమైంది. రైతాంగానికి ఆసరాగా నిలిచి, వారిని ఆదుకున్న పార్టీ బీఆర్ఎస్. ఇపుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా బీఆర్ఎస్ చేసిన పనులను మరింత ముందుకు తీసుకుపోవటమే చేయాలి. కానీ, కాంగ్రెస్ శూన్య హస్తాలను చూపుతున్నది.

అస్తిత్వ ఉద్యమంపై ఆనాటి ఉద్యమ కాలంలో నిప్పులు పోసినవాళ్లే రూపాలు మార్చుకుని స్వరాష్ట్రంలో కూడా కుట్రలు చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనపై విషంగక్కారు. అధికారాన్ని కోల్పోయిన పాత పెత్తందార్లు తమ పీఠాలు కాపాడుకునేందుకు బీఆర్ఎస్‌పై చేయని దుష్ప్రచారం లేదు. తాత్కాలికంగా ఎన్నికల్లో గెలిచినంతమాత్రాన తెలంగాణ అస్తిత్వంపై దాడి చేస్తే మాత్రం తెలంగాణ సమాజం తిరగబడుతుంది.

వరంగల్‌లో జరగబోయే రజతోత్సవ సభ బీఆర్ఎస్ కార్యకర్తల్లోనే కాదు, మొత్తం తెలంగాణ సమాజానికే ప్రేరణ. బీఆర్ఎస్ రాజకీయ పార్టీగానే కాకుండా తెలంగాణ పునర్నిర్మాణాన్ని కొనసాగించే మిషన్‌గా చూడాలి. తెలంగాణ సమాజ అస్తిత్వంతో పెన వేసుకున్న బీఆర్ఎస్‌ను కదిలించటం ఎవరి తరం కాదు. ఏప్రిల్ 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ తెలంగాణ సమాజ ఆకాంక్షలు నెరవేర్చే సభగా కోట్లాది మంది ఎదురుచూస్తున్నారు.

**(వ్యాసకర్త: రాజ్యసభ సభ్యులు)**

# ఒక కేసీఆర్..ఎన్నో విజయాలు



**షేక్ ఫరెజ్ మొహియుద్దీన్**
**96661 74738**

**తెలంగాణ విధాత, అభివృద్ధి ప్రదాత, ఉద్యమ సారథి కేసీఆర్ ప్రస్థానం సముద్రపు కెరటం లాంటిది. కాలం, సమయం, విధి విషమ పరీక్ష పెట్టిన ప్రతీసారి ఎన్నో ఆటుపోట్లను తట్టుకుంటూ ఆయన గెలుస్తూ వచ్చారు. ప్రత్యర్థుల వ్యూహాలను ఛేదిస్తూ, ప్రతివ్యూహాలు రచిస్తూ, రాజకీయ ప్రత్యర్థుల పద్మవ్యూహాలను పటాపంచలు చేస్తూ వచ్చారు. అది ఉద్యమమైనా, ఎన్నికలైనా, ఉపఎన్నికలైనా, పరిపాలనలో అయినా, సంక్షేమ పథకాల అమలులో అయినా.. పాతికేండ్ల ప్రస్థానంలో కేసీఆర్ ఎన్నడూ వెరవలేదు, వెనకడుగు వేయలేదు.**

బీఆర్ఎస్ ఆవిర్భవించిన 2001 నుంచి నేడు 2025 వరకు గులాబీ పార్టీపై ప్రత్యర్థులు, తెలంగాణ వ్యతిరేకులు చేసిన కుట్రలు అన్నీఇన్నీ కావు. పురిట్లోనే పాడెక్కించాలని చేయని ప్రయత్నమంటూ లేదు. 'మఖలో పుట్టి పుబ్బలో పోతుంద'ని విషప్రచారం చేశారు. గులాబీ పార్టీ తీరం చేరదని, మధ్యలోనే పుట్టి మునిగిపోతుందని దుష్ప్రచారం చేశారు. పదవుల కోసమే కేసీఆర్ తెలంగాణవాదాన్ని ఎత్తుకున్నారని, రాజకీయ ఉనికి కోసమే ఉద్యమ జెండా పట్టారని కుట్రల కూతలు కూశారు. ఆంధ్రా పాలకులతో పాటు తెలంగాణలోని చెంచాలు కూడా ఇదేవిధంగా కుయుక్తుల కథనాలను వండివార్చారు. తెలంగాణ సానుభూతిపరులు గులాబీ పార్టీలో చేరకుండా, పార్టీలో ఉన్నవారు ఉద్యమ జెండా ఎత్తకుండా టీడీపీ ఏలికలు, పీలికల కాంగ్రెస్ చేయని కుతంత్రం లేదు. కానీ, కేసీఆర్ వాటన్నింటినీ పటాపంచలు చేశారు.

> పురిట్లోనే పోతదన్న పార్టీతోనే తెలంగాణకు పురుడుపోయించారు. దిక్కూమొక్కు లేక నడిసంద్రంలో చిక్కుకున్న తెలంగాణను వాయుగుండాలు, తుఫాన్లను దాటుకొని తీరానికి చేర్చారు. పదవుల కోసమే ఉద్యమ జెండా పట్టారన్న అనుమానాలను ఆదిలోనే బొంద పెట్టారు. పదవులను పట్టుకొని ఊగిసలాడే రాజకీయ నాయకులను విస్మయ పరుస్తూ.. పదవులను త్యజించడం, అధికార పీఠాన్ని త్యాగం చేయడాన్నీ తమ అదృష్టమనుకునే స్థాయికి గులాబీ సైన్యాన్ని తీసుకొచ్చారు. ప్రజల ఆకాంక్షలు, తెలంగాణ సాధించాలన్న లక్ష్యం ముందు తమ పదవులు గడ్డి పోచలేనని సహచరులకు నూరిపోశారు.

ఉద్యమ సారథి చెప్పడమే ఆలస్యం క్షణాల్లో పదవులకు రాజీనామా చేసేలా, జేబులోనే రాజీనామా లేఖలను పెట్టుకొని తిరిగేలా గులాబీ దళాన్ని తయారు చేశారు. రాజీనామాలను అస్త్రాలుగా, ఎన్నికలను శస్త్రాలుగా సంధించారు. తెలంగాణ ఇస్తానని నమ్మించి గొంతు కోసిన కాంగ్రెస్‌కు ఉపఎన్నికల్లో గెలుపుతోనే కేసీఆర్ సమాధానం ఇచ్చారు.

ప్రస్తుత రాజకీయాల్లో ఎలాంటి కుటుంబ రాజకీయ నేపథ్యం గాని, సినీ నేపథ్యం గాని లేకుండా సొంతగా ఒక పార్టీని స్థాపించి, ప్రజా ఉద్యమాలు నడిపి, ప్రజల మన్ననలతో అధికారం చేపట్టి ముఖ్యమంత్రి అయినవారు తెలుగు రాజకీయాల్లో కేసీఆర్ ఒక్కరే కనిపిస్తారు. ఆ మాటకొస్తే యావత్ దక్షిణ భారతదేశంలో డీఎంకే వ్యవస్థాపకులు, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై తర్వాత కేసీఆర్ మాత్రమే ఉంటారు. అందులోనూ అన్నాదురైకి ద్రవిడ ఉద్యమ నేపథ్యం మాత్రమే ఉండగా.. కేసీఆర్‌ది 60 ఏండ్ల ఆకాంక్ష అయిన తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం. నాటి చెన్నారెడ్డి నుంచి మొదలుకొని నిన్న మొన్నటి జానారెడ్డి, చిన్నారెడ్డి వరకు ఎంతో మంది మూణ్నాలుగు నెలలు ఉద్యమాలు నడిపి, ఆ తర్వాత పదవులకో, ప్రలోభాలకో లొంగిపోయి ఉద్యమాన్ని తాకట్టు పెట్టారు. కేసీఆర్ ఒక్కరే పదవులను త్యాగం చేసి, చావు నోట్లో తలపెట్టి తెలంగాణ ఉద్యమాన్ని విజయతీరాలకు చేర్చారు. అందరూ రాష్ర్టాలకు ముఖ్యమంత్రులు అయితే, కేసీఆర్ మాత్రం రాష్ర్టాన్ని సాధించి తొలి ముఖ్యమంత్రి అయ్యారు.

14 ఎండ్ల పాటు సాగిన ఉద్యమంలో అడుగడుగునా ఆటంకాలే. కాలు బయట పెట్టాలన్నా ఆంక్షలే. పార్టీ సమావేశాలకు అనుమతులు ఇవ్వని పరిస్థితి. ఆఖరికి కళాకారుల ధూం ధాం ప్రోగ్రాంలకు నిర్బంధాలే. పెన్ డౌన్ చేసే తెలంగాణ ఉద్యోగులపై ఆంక్షలు, విద్యార్థులపై లాఠీ చార్జిలు, గులాబీ సేనపై అక్రమ కేసులు, నిర్బంధాలు.. ఒక్కటేమిటి ఇలా ఎన్నో ఆటుపోట్లు.

పురిట్లో ఉండగానే తెలంగాణ గొంతు నులిమి చంపేయాలని ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. తెలంగాణ వస్తే చీకటిమయం అవుతుందని, నక్సలైట్ల రాజ్యంగా మారుతుందని సమైక్య పాలకులు భయాందోళనలు సృష్టించారు. ఉద్యమకారుల త్యాగాలకు తోడు, కేసీఆర్ తన ప్రాణాలను పణంగా పెట్టి తెచ్చిన తెలంగాణ ప్రకటనను కుట్రలు చేసి వెనక్కి తీసుకునేలా చేశారు. అయినా కేసీఆర్ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. కొత్త మార్గాలను శోధించి, తెలంగాణను సాధించారు.






తెలంగాణ వచ్చిన తర్వాత కూడా సమైక్యాంధ్ర నాయకుల కుట్రలు ఆగలేదు. తెలంగాణలోని తాబేదార్ల సాయంతో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి తెలంగాణను అస్థిరపరిచేందుకు చంద్రబాబు కుట్ర చేశారు. తెలంగాణ వాళ్లకు పాలన చేతకాదని నిరూపించేందుకు కుటిల యత్నం చేశారు. ఆ పన్నాగాన్ని పసిగట్టిన కేసీఆర్.. ఎత్తుకు పైఎత్తు వేయడంతో చంద్రబాబు తోకముడిచి పారిపోవాల్సి వచ్చింది. ఆ తర్వాత 2018లో తెలంగాణ ఎన్నడూ చూడని కొత్త కుట్రకు తెరలేచింది. బీఆర్ఎస్‌ను మట్టుబెట్టేందుకు, తెలంగాణను దోచుకునేందుకు బద్ధ శత్రువు చంద్రబాబుతో కాంగ్రెస్ జతగట్టింది. నాడు చంద్రబాబు దగ్గర అప్పటి పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతులు కట్టుకొని నిలబడి తెలంగాణ అస్తిత్వాన్ని పరాయివాళ్ల ముందు తాకట్టు పెట్టారు. తెలంగాణకు అన్యాయం జరిగితే సహించలేని కేసీఆర్.. తెలంగాణ వ్యతిరేకి చంద్రబాబును పొలిమేరల వరకు తరిమికొట్టారు. టీడీపీని పూర్తిగా బొందపెట్టారు.

పాతికేండ్ల కిందట టీఆర్ఎస్‌పై మొదలైన కుట్రల పరంపర నేటికీ కొనసాగుతూనే ఉన్నది. ఢిల్లీలో బద్ధ శత్రువులైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు గల్లీలో కలిసిపోయి బీఆర్ఎస్‌ను గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించాయి. ఇంతటితో ఆగకుండా బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా తుడిచిపెట్టాలని కుట్రలు పన్నాయి. 'మనం మనం కొట్లాడుకోవడం కాదు, అక్కడక్కడున్న బీఆర్ఎస్‌ను పూర్తిగా బొందపెట్టాలి' అని బండి సంజయ్ గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు పిలుపివ్వడమే అందుకు నిదర్శనం. ఇలాంటి కుట్రలు బీఆర్ఎస్‌కు కొత్త కాదు. ఈ పాతికేండ్ల ప్రస్థానంలో ఇలాంటి కుట్రలెన్నింటినో కేసీఆర్ చూశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన ఆరు నెలలకే గోడకు కొట్టిన బంతిలా బీఆర్ఎస్ బౌన్స్ బ్యాక్ అయింది. ఇప్పుడు బీఆర్ఎస్ రజతోత్సవ వేళ ఊరువాడా కేసీఆర్‌ను తలుచుకుంటున్నది. ప్రతి ఇంట గులాబీ జెండా రెపరెపలాడుతున్నది.


> ఎన్నో కష్టాలను, దుఃఖాలను అధిగమించి, కుట్రలు, కుతంత్రాలను బీఆర్ఎస్ ఛేదించింది. తెలంగాణ వస్తే చీకటి మయమవుతుందని ఉమ్మడి పాలకులు చెప్పారు. తెలంగాణ వచ్చాక దాన్ని నిజం చేసేందుకు కుట్రపూరితంగా సీలేరు విద్యుత్తు ప్రాజెక్టును గుంజుకున్నారు. ఇలాంటి ఎన్నో కష్టాలను పంటి బిగువున దాచిపెట్టుకొని కేసీఆర్.. రెండేండ్లలోనే ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందం చేసుకొని 24 గంటల పాటు నాణ్యమైన ఉచిత కరెంటు ఇచ్చారు. తెలంగాణను పెట్టుబడులకు తెలంగాణను కేరాఫ్ అడ్రస్‌గా కేటీఆర్ మార్చారు.

ఇలా ఒకటా, రెండా సవాళ్లు ఎదురైన ప్రతిసారి కేసీఆర్ వాటిని అధిగమిస్తూ, గెలుస్తూ వస్తున్నారు. కేసీఆర్ గెలిచిన ప్రతిసారి, తాను గెలవడమే కాకుండా తెలంగాణ ప్రజలను కూడా గెలిపించారు. ఒక మాటలో చెప్పాలంటే కేసీఆర్ గెలుపులో తెలంగాణ ప్రజల గెలుపు ఉన్నది. అందుకే ప్రజలు నేడు తాము కాంగ్రెస్ 420 హామీలను చూసి మోసపోయి గోసపడుతున్నామని, సమస్యలు పరిష్కారమై తమ జీవితాల్లో మళ్లీ వెలుగులు నిండాలంటే కేసీఆర్ సారే రావాలని కోరుకుంటున్నారు. ప్రతి ఊరి నుంచి భారీ సంఖ్యలో సభకు తరలివెళ్లి గతంలో ఇదే వరంగల్‌లో జరిగిన మహా గర్జన మాదిరిగా విజయవంతం చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. అందుకే ముమ్మాటికీ బీఆర్ఎస్ రజతోత్సవం.. తెలంగాణ విజయోత్సవం.

**(వ్యాసకర్త: బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)**



## కెలకటి వెలుగులో జన జాతర



బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ అంటే ఒక సాధారణ రాజకీయ సభ కాదు. అది తెలంగాణ ప్రజల మనస్సుల్లో కేసీఆర్ పట్ల ఉన్న గాఢమైన విశ్వాసానికి ప్రతిబింబం. ఈ సభ ప్రాంగణంలో ప్రజల ఊపిరి, ఆశ, ఆరాధన ప్రతీ స్వరంలో వినిపిస్తుంది. ఈ జన సమీకరణ చూస్తుంటే 10 లక్షల మందిని దాటి, బాహుబలి సినిమాలో చూసిన మహా జనసందోహం నిజంగా పునరావృతం అవుతుందనిపిస్తుంది. ఇది కుంభమేళాను మించిపోయే దృశ్యం. ఇటువంటి సమీకరణాన్ని చిత్రీకరించడానికి డ్రోన్ కెమెరాల శక్తికే సవాలు. ఇది కేవలం ఓ సభ కాదు, ఇదొక నాయకుడిపై ప్రజల ప్రేమకు, విశ్వాసానికి ప్రతిరూపం.

పాతికేండ్లలో ఒకసారైనా చూడలేని విప్లవాత్మక సంఘటన ఇది. కరోనా టైంలో వ్యాక్సిన్ కన్నా ముందు ప్రజల పాకటిలో కేసీఆర్ ఏమంటారు? అనే చింతే ఉన్నది. ఇప్పుడా స్థాయిలోనే కాంగ్రెస్ అనే కొత్త ప్రమాదం వచ్చినప్పుడు ప్రజల చూపు మళ్లీ కేసీఆర్ వైపే. ఇదీ నాయకత్వంపై నమ్మకం. అవిశ్రాంతంగా పనిచేసిన నాయకుడిపై కృతజ్ఞత.

ఇక్కడి విశేషం ఎన్నికల సమయం కాదు, ఉద్యమాలు లేవు, కుల మతాలతో సంబంధం లేని సభ అయినా లక్షల మంది కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలిరావడం దేశ చరిత్రలోనే అరుదైన ఘట్టం. ఇది ఒక్క కేసీఆర్ ఒరవడి వల్లే సాధ్యమైంది. ఆయన లేకుండా తెలంగాణను ఊహించలేమనే భావం ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నది. ఈ మహా సభకు నేనూ ఓ వీక్షకుడిగా హాజరవడం, ఆ నాయకుడిని ప్రత్యక్షంగా చూడటం, ఆయన మాటలు వినడం నా జీవితంలో ఒక గౌరవ గడియగా నిలిచిపోతుంది. జై తెలంగాణ, జై కేసీఆర్.

**- నరేష్ మైనల,** (కేటీఆర్ సేన, వరంగల్ జిల్లా అధ్యక్షుడు)

## తెలంగాణ స్వాభిమాన సభ



ఉద్యమ రథసారథి కేసీఆర్‌పై ఉన్న అభిమానంతో ఆయన అభిమానులందరినీ ఒక్కతాటిపైకి తీసుకవచ్చి గత పన్నెండేండ్లుగా మేం బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ శాఖను బలోపేతం చేస్తున్నాం. ఇందులో భాగంగానే ప్రపంచవ్యాప్తంగా 52 శాఖలను స్థాపించాం. భారత దేశంలోని ఏ ఇతర రాజకీయ పార్టీకి ఇంత విస్తృతమైన ఎన్ఆర్ఐ శాఖల్లేవు. అయితే, ఓరుగల్లు సభ ద్వారా బీఆర్ఎస్ తన భవిష్యత్తును మరింత బలోపేతం చేసుకోవడమే కాకుండా, తెలంగాణ ప్రజలకు తామే నిజమైన ప్రతినిధులమని నిరూపించనున్నది. ఈ రజతోత్సవ సభ ఒక రాజకీయ సమావేశం మాత్రమే కాదు; ఇది తెలంగాణ ఆత్మగౌరవం, స్వాభిమానం, రాష్ట్ర హక్కుల కోసం బీఆర్ఎస్ చేస్తున్న సంకల్ప ప్రకటన. గత 16 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణను విఫల రాష్ట్రంగా మార్చిన తరుణంలో, ఈ సభ ద్వారా రాష్ట్ర ప్రజలకు కొంత ఉపశమనం లభించనున్నది.

ఓరుగల్లు సభకు ఎన్ఆర్ఐ శాఖ భారీ సంఖ్యలో సభ్యులను ఆహ్వానిస్తున్నది. లక్షలాది మంది ప్రజలు, కార్యకర్తలు, ఎన్ఆర్ఐ సభ్యులు ఈ సమావేశంలో భాగం కానున్నారు. ఈ సభ స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా రజతోత్సవ సభలు నిర్వహిస్తున్నాం. మొదటగా అమెరికాలోని డల్లాస్‌లో జూన్ ఒకటో తారీకు కేటీఆర్ ముఖ్య అతిథిగా, మిగతా బీఆర్ఎస్ నాయకులతో పెద్ద సభను నిర్వహించనున్నాం. ఈ సభలను ఈ సంవత్సర కాలం పాటు యూకే, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, గల్ఫ్ దేశాలతో పాటు మలేషియాలలో జరుపుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నాం.

2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత 16 నెలలుగా తెలంగాణ ప్రజలను మోసం చేస్తూనే ఉన్నది. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలని ప్రకటించి, వాటిని అమలుచేయడంలో విఫలమైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ర్టానికి రూ.7 లక్షల కోట్ల అప్పు ఉన్నదని ఆరోపించిన కాంగ్రెస్, తాము అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే రూ.1.52 లక్షల కోట్ల కొత్త అప్పులు తెచ్చింది. ఈ అప్పులు అభివృద్ధి పనుల కోసం కాకుండా, రోజువారీ ఖర్చులు, రాజకీయ లబ్ధి కోసం వినియోగిస్తున్నారని విమర్శలు వస్తుండటమే విడ్డూరం. అందుకే, రజతోత్సవ సభలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలబడనున్నది. మళ్లీ అధికారంలోకి వచ్చి ప్రజలకు న్యాయం చేసే దిశగా అడుగులు వేయనున్నది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ శాఖలు ఈ సభను స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ భవిష్యత్తును బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషించాలి.

**- మహేష్ బిగాల**
**(వ్యాసకర్త: గ్లోబల్ బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటర్)**

## పైలా పచ్చీస్!

యవ్వనం ఉరకలెత్తుతున్నది
ఒకింత విరామం తర్వాత
పోరుబాట విచ్చుకుంటున్నది!

అబద్ధాల ఉచ్చులు
పటాపంచలవుతున్న వేళ
విమోచన దండొకటి కదులుతున్నది!

దశాబ్దం పాటు
ఏ కడుపూ కాలలేదు
ఏ కంటిలో నీరు కారలేదు!

ఆశలూ ప్రలోభాలూ
కళ్ళముందే ఆవిరవుతున్న వేళ
జనాగ్రహం రెక్కలు విప్పుతున్నది!

అలికి పూసిన కాడ
గుడ్డు పెట్టని గువ్వ
ఉన్నా ఒకటే లేకున్నా ఒకటే!

యుద్ధం ఎప్పుడైనా రాని
మరో విమోచనం కోసం
మనమిప్పుడు సిద్ధమవ్వాల్సిందే!

పంచభూతాల కన్నా
శక్తివంతం జనాభిప్రాయం
రగిలిస్తే చాలు వెలుగిస్తది!

ఓడి గెలిచిన వారెవరో
గెలిచి ఓడిన వారెవరో
జనాలకు అప్పుడే తెలిసిపోయింది!

పడిలేచిన కెరటాలే
తీరాలను ముద్దాడేది
జయ పతాకాలనెగరేసేది!!



**కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
**94402 33261**

# తెలంగాణ కోసం మళ్లీ గొంతెత్తుదాం!



**మద్దెల సందీప్**
**95503 12564**

**తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి మొదలుకొని మలిదశ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వరకు ప్రజల కష్టాలు, కన్నీళ్లు, ధీరత్వం, అమరత్వం అన్ని కలగలిపి ముందుకు తీసుకుపోయింది పాట మాత్రమే. బండి యాదగిరి, సుద్దాల హనుమంతు మొదలుకొని నేటి తెలంగాణ పల్లెల్లో పాటకు ప్రాణం పోస్తున్న యువ గాయకుల వరకు తెలంగాణ ప్రజల బాధలను మటుమాయం చేసేందుకు కృషిచేసినవారే. నాడు 'బండెనక బండి కట్టి ఏ బండ్ల వోతవు కొడుకో' అన్న పాట మొదలుకొని మలిదశ ఉద్యమంలో వేల పాటలు తెలంగాణ భూమిని జ్వలింపచేశాయి. లక్షల గొంతుకలు స్వరాష్ట్రం కోసం నినదించాయి. ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని పల్లెపల్లెకు, గుండెగుండెకు తీసుకుపోయి ఉద్యమ భావజాలాన్ని విస్తరించిన ప్రధాన ప్రక్రియ పాట. పాటలు సామాన్య జనాన్ని ప్రభావితం చేసి, ఉద్యమానికి బలాన్ని చేకూర్చాయి.**

**'రాజిగ ఓరి రాజిగా..!'**, 'అమ్మా తెలంగాణమా ఆకలికేకల రాజ్యమా..!', 'పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా... పోరు తెలంగాణమా..!', 'జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం..!', 'నాగేటి సాల్లళ్ల నా తెలంగాణ.. నా తెలంగాణ..!', 'రేలా దూలా తాలెల్లాడే నేల నా తెలంగాణ..!', 'పల్లె కన్నీరు పెడుతుందో..!', 'సంతా మావురి సంత..!', 'వీరులారా వందనం విద్యార్థి... అమరులారా వందనం..!', 'ఆడుదాం డప్పుల్లా దరువెయ్యరా పల్లె తెలంగాణ పాట పాడరా..!', 'నిన్ను విడిచి ఉండలేనమ్మా..!', 'రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా రక్తబంధం విలువ నీకు తెలియదురా..!', 'ఉస్మానియా క్యాంపస్‌లో ఉదయించిన కిరణమా వీర తెలంగాణమా...!' వంటి వేల పాటలు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి. పల్లె నుంచి పట్నం వరకు పాటలతో తెలంగాణ రాష్ట్రమే కావాలని ఊగిపోయింది. సమైక్య పాలనకు సవాల్‌గా మారింది. రైతన్నల వెతలు, వ్యవసాయ కూలీల కష్టాలు, కార్మికుల కన్నీటి బాధలు, మహిళల ఆకాంక్షలు, ఫ్లోరైడ్ వ్యతిరేక పోరాటాలు, సాగునీటి సాధన.. ఇట్లా ప్రతి వర్గం కోసం గొంతుకై నిలిచారు తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారులు.

ప్రజాగాయకుడు గద్దర్, బెల్లి లలిత, గోరటి వెంకన్న, విమలక్క, డప్పు రమేశ్, గూడ అంజన్న, అందెశ్రీ, జయరాజు, అరుణోదయ రామారావు, వందేమాతరం, శంకర్, సారంగపాణి, వరంగల్ శ్రీను, ఎర్ర ఉపాలి, కలేకూరి, రసమయి బాలకిషన్, పయిలం సంతోశ్, పుష్ప, సాయిచంద్, ఏపూరి సోమన్న, కోదారి శ్రీను, అంబటి వెంకన్న, విజయ, రమాదేవి, అంతడ్పుల నాగరాజు, నేర్నాల కిశోర్, మిట్టపల్లి సురేందర్, దరువు ఎల్లన్న, దరువు అంజన్న, గర్జన, దేవరకొండ భిక్షపతి, వడ్లకొండ, శంకర్, దేవన్న, తిరుపతి, ఆశ్విని, మధుప్రియ, మానుకోట ప్రసాద్, సంతోష్ వంటి వందల మంది కళాకారులు కాలుకు గజ్జె కట్టి తెలంగాణ ప్రజల అరవై ఏండ్ల ఆకాంక్ష కోసం గొంతెత్తి నినదించారు. 2001లో కేసీఆర్ నాయకత్వంలో టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటుతో తెలంగాణ పాటకు ఒక అండ దొరికింది. ఒకపక్క రాజకీయ పార్టీగా కేంద్రంపై కేసీఆర్ చేసిన ఒత్తిడి.. ప్రజలను ఏకం చేసేందుకు కళాకారుల పాటలు.. వెరసి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించేలా చేశాయి.



స్వరాష్ట్రం కోసం గొంతెత్తిన తెలంగాణ కళాకారుల రుణం తీర్చుకోవాలన్న ఉద్దేశంతో కేసీఆర్.. సాంస్కృతిక సారథిని ఏర్పాటు చేసి, 500 మందికిపైగా కళాకారులకు సాంస్కృతిక సారథులుగా నియమించారు. రసమయి బాలకిషన్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించి 'సారథి'కి చైర్మన్‌గా నియమించారు. గోరటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్‌లకు శాసనమండలి సభ్యులుగా అవకాశం కల్పించారు. సాయిచంద్‌ను కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. ఇంకా చాలామందికి నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల్లో అవకాశాలు కల్పించారు. పాటల గొంతుకైన బెల్లి లలితను ముక్కలు చేసిన, మారోజు వీరన్నను బూటకపు ఎన్‌కౌంటర్ చేసిన, తొర్రూరు అయిలన్నను అంతం చేసిన సందర్భంలో కేసీఆర్.. కళాకారులు, కవులను కాపాడుకున్నారు.

పదేండ్ల తర్వాత మళ్లీ సమైక్య పాలన నాటి ఆనవాళ్లు పునరావృతం అవుతున్నాయి. వివక్ష చూపే పాలన పోవాలని నినదించిన గొంతులు మళ్లొక్కసారి ప్రజల కోసం పోరాడుతున్న కేసీఆర్‌కు అండగా నిలువాల్సిన సందర్భం ఆసన్నమైంది. తెలంగాణ వనరుల రక్షణ కోసం ఎలాగైతే సమైక్యవాదులపై పోరాటం చేశామో.. సొంత రాష్ట్రంలో ద్రోహానికి ఒడిగడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి సిద్ధమవుదాం! తెలంగాణ రక్షణ కోసం, ప్రజల హక్కుల కోసం బీఆర్ఎస్ చేసే పోరాటంలో భాగమవుదాం!

**(వ్యాసకర్త: గాయకులు)**